క్లుప్తంగా

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో-1 పాండురంగారావు

మాడుగుల రూరల్: వీరనారాయణం ఎంపీపీ పాఠశాలను ఎంఈవో-1 ఎం. పాండురంగారావు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో రికార్డులను పరిశీలించి, పిల్లల నైపుణ్యాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం మెనూను పరిశీలించారు. హెచ్‌ఎం ఆనంద్, సీఆర్పీ బి. హరికృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిఘా నీడలో సబ్ కలెక్టర్ ఆఫీస్



రికార్డు రూమ్‌కు ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

నర్సీపట్నం: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయానికి నలువైపులా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కార్యాలయంలో జరిగే కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు వీటిని అమర్చారు. ప్రధాన రోడ్డుకు ఆనుకున్న సబ్ కలెక్టర్ కార్యాలయానికి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. మదనపల్లి సంఘటన నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో హెచ్.వి.జయరాం కార్యాలయానికి నలువైపులతోపాటు రికార్డు రూమ్‌కు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు.

మాడుగులలో ఫ్రైడే డ్రైడే



నీటి నిల్వలు పారబోస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ లత, తదితరులు

మాడుగుల రూరల్: స్థానిక గ్రామ సచివాలయం -2 పరిధిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎంఎల్‌హెచ్‌పీ లత ఆధ్వర్యంలో జవ్వాదిగెడ్డ, జగ్గన్న చావిడి, తదితర పరిసరాలల్లో పరిశుభ్రత, దోమలు నిల్వ ఉండటం వల్ల వచ్చే అనర్థాలు గురించి ప్రజలకు వివరించారు. గోళెం, నీటి కుండీల్లో నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే తల్లీబిడ్డ ఆరోగ్యం



గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ధనలక్ష్మి

రోలుగుంట: గర్భిణి సమయంలో తీసుకున్న పోషకాహారం ఆధారంగానే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని వైద్యాధికారి కె.ధనలక్ష్మి తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ రోగులతోపాటు గర్భిణులను ఆమె పరీక్షించారు. గర్భిణుల్లో కొంతమందికి 11 గ్రాముల కంటే తక్కువగా హిమోగ్లోబిన్ ఉన్నట్టు గుర్తించారు. పోషకాలు కలిగిన గుడ్డు, ఆకు కూరలు, పాలు ఆహారంలో భాగంగా వాడాలన్నారు. మసాలాలు తగ్గించాలన్నారు. ఆరోగ్య పరీక్షలు చేయించుకుని క్రమం తప్పకుండా మందులు వాడి రకాన్ని వృద్ధి చేసుకోవాలని గర్భిణులకు సూచించారు.

నేడు సర్వసభ్య సమావేశం

మాకవరపాలెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో చంద్రరావు తెలిపారు. ఎంపీపీ సత్యనారాయణ అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలని ఆదేశించారు.

జవాన్ల సేవలు వెలకట్టలేం

- నర్సీపట్నం ఆర్డీవో జయరాం
- కార్గిల్ వీరులకు ఘన నివాళి



నర్సీపట్నం: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నర్సీపట్నం: దేశానికి సేవలందిస్తున్న వీర జవానుల సేవలు వెలకట్టలేనివని ఆర్డీవో హెచ్.వి.జయరాం తెలిపారు. రాష్ట్ర స్వయం సేవక్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఆర్డీసీ కాంప్లెక్స్ నుంచి ఎన్టీఆర్ స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఉద్దేశించి ఆర్డీవో మాట్లాడుతూ మన దేశ వీరజవాన్లు ప్రాణాలను తెగించి పాకిస్తాన్ ముష్కరులపై దేశాన్ని కాపాడారన్నారు. ప్రాణాలర్పించిన వీరజవాన్ల త్యాగం వృథా పోనీకూడదన్నారు. సీఐ హరి మాట్లాడుతూ దేశాన్ని కంటికి రెప్పలా కాపాడుతున్న సైనికులకు మనం స్ఫూర్తిని ఇవ్వాలన్నారు. విద్యార్థులంతా హక్కులతో పాటు బాధ్యతలు గుర్తెరగాలన్నారు. కార్యక్రమంలో ఆరెస్సెస్ ప్రాంత కార్యకారిణి ఓలేటి సత్యనారాయణ, వెలగా జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల: స్థానిక ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయంలో శుక్రవారం కార్గిల్ దివస్ నిర్వహించారు. కార్గిల్ యుద్ధ సమయంలో దేశ సరిహద్దులో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన మాడుగులకు చెందిన మాజీ సైనికులు అత్తిలి జగన్నాథరావు, వి.సందీప్‌వర్మలను సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు మాట్లాడుతూ నేటి యువత కార్గిల్ వీరులను ఆదర్శంగా తీసుకుని దేశ సేవ అలవర్చుకోవాలన్నారు. సర్పంచ్ ఎడ్ల కళావతి, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, పుట్టా గంగయ్య, దేవరాపల్లి శ్రీనువాసరావు, బొమ్మిశెట్టి శ్రీనువాసరావు, జవ్వాది వరహాలు, ఎడ్ల హేమంత్‌కుమార్, గౌరీపట్టపు మహేష్ కుమార్, పుట్టా బలరామ్, కోడూరు కొండలరావు పాల్గొన్నారు.



మాడుగుల:మాజీ సైనికులను సన్మానిస్తున్న దృశ్యం

వడ్డాదిలో విజయోత్సవ ర్యాలీ

బుచ్చెయ్యపేట: కార్గిల్ దివస్ సందర్భంగా వడ్డాదిలో విజయోత్సవ ర్యాలీ చేపట్టారు. శుక్రవారం రాత్రి గ్రామ యువకులు జాతీయ జెండాలు చేతపట్టి వడ్డాది చెరకు కాటా నుంచి నాల్గు రోడ్ల జంక్షన్ వరకు ర్యాలీగా సాగుతూ భారత్ మాతాకీ జై.. కార్గిల్ యుద్ధ వీరులుకు జోహార్లు అంటూ నినదించారు. ఈ ర్యాలీలో శిరిగిరిశెట్టి దొరపిల్ల, శ్రీరామూర్తి, దూది రాజేష్, దొండా సాయి, ఎడ్ల రామూర్తి, గొంతెన ఈశ్వరరావు, సయ్యపురెడ్డి మణికంఠ, శరగడం వెంకటరావు, రత్నాజీ, వడ్డాది యూత్ సభ్యులు పాల్గొన్నారు.



బుచ్చెయ్యపేట: వడ్డాదిలో జాతీయ జెండాలతో యువకుల విజయోత్సవ ర్యాలీ



మాకవరపాలెం: అమర వీరులకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కార్గిల్ వీరుల త్యాగాలు చిరస్మరణీయం

మాకవరపాలెం: కార్గిల్ అమర వీరులకు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘన నివాళులర్పించారు. కార్గిల్ విజయ్ దివస్‌ను తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భరతమాత చిత్రపటంతోపాటు జాతీయ జెండాలు ప్రదర్శించారు. సైనికుల త్యాగాలను స్మరించుకుని, వీరులకు ఘన నివాళులర్పించారు. అనంతరం హెచ్‌ఎం కె.రాము మాట్లాడుతూ చిన్నతనం నుంచే ధైర్య సాహసాలు ఉండటంతోపాటు దేశభక్తి, సమాజం పట్ల ఆలోచించడం అలవర్చుకోవాలన్నారు. ఉపాధ్యాయులు లోవరాజు, సంతోషి, నారాయణరావు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



కె.జె.పురంలో పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న సర్పంచ్ రమణబాబు



ఏఎల్‌పురంలో పనులు జరుగుతున్న దృశ్యం

మాడుగుల రూరల్: కె.జె.పురంలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. వచ్చే నెల నాల్గో తేదీన మోదమాంబ పండగ నేపథ్యంలో ఆలయ పరిసరాల్లో, తాచేరు బ్రిడ్జి నుంచి గ్రామం వరకు రహదారికిరువైపులా పిచ్చిమొక్కలను జేసీబీతో తొలగించారు. సర్పంచ్ జామి రమణబాబు పర్యవేక్షణలో చేపట్టిన ఈ కార్యక్రమంలో పంచాయతీ గుమస్తా సాహూ, వార్డు సభ్యులు ఆడారి వెంకట సూరిప్పారావు పాల్గొన్నారు. పండగ సందర్భంగా కె.జె.పురం జంక్షన్ వరకు జంగిల్ తొలగిస్తామని సర్పంచ్ తెలిపారు.

గొలుగొండ: ఏఎల్‌పురం మేజర్ పంచాయతీలో శుక్రవారం పారిశుధ్య పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఎంపీడీవో రత్నకుమారి ఆదేశాల మేరకు పారిశుధ్య మెరుగుకు చర్యలు తీసుకున్నారు. ఇక్కడ ప్రధాన వీధుల్లో చెత్తాచెదారాలను, కాలువల్లో పేరుకుపోయిన పూడికను తొలగించారు. సర్పంచ్ లోచల సుజాత, కార్యదర్శి శ్రీనువాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

చీడికాడ: తురువోలులో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ మట్టా అప్పారావు తెలిపారు. మురుగు కాలువల్లో పూడికతీతతోపాటు జంగిల్ క్లియరెన్స్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రధాన రహదారిలో చెత్తను తొలగిస్తున్నామన్నారు. ఈ పనులను ఉప సర్పంచ్ పి.టి.బాబు, కార్యదర్శి ఉమామహేశ్వరి పర్యవేక్షిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు.

రైతులకు రాయితీపై గడ్డి విత్తనాల పంపిణీ



రైతులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి నూకేశ్వర్రావు



రైతులకు గడ్డి విత్తనాలను పంపిణీ చేస్తున్న పశువైద్యాధికారి నాయుడు

కె.కోటపాడు: పాడి రైతులు పశువులకు మేతగా కాకిజొన్న, మొక్కజొన్న రకం గడ్డిని అందించాలని కొరువాడ పశువైద్యాధికారి సిహెచ్.వై.నాయుడు తెలిపారు. కొరువాడ, వి.సంతపాలెం గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల ద్వారా శుక్రవారం రైతులకు రాయితీపై కాకి, మొక్కజొన్న గడ్డి విత్తనాలను అందించారు. ఈ రకం గడ్డిని పశువులు మేతగా తినేందుకు ఇష్టపడతాయన్నారు. గడ్డిలో కార్బోహైడ్రేట్స్, ప్రోటీన్స్ ఎక్కువగా ఉండడం వల్ల పాల దిగుబడి అధికంగా ఇవ్వడంతోపాటు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. ఈ రెండు రకాల గడ్డి విత్తనాలను నాటిన 45 నుంచి 60 రోజుల లోపు కోతకు చేరుకుంటుందన్నారు. ఐదు కిలోల కాకిజొన్న గడ్డి విత్తనాలు రాయితీపై రూ.115కు, మొక్కజొన్న రకం గడ్డి విత్తనాలు రూ.85కు ఇస్తున్నట్లు తెలిపారు. వి.సంతపాలెం పశువైద్య సహాయకుడు లింగేశ్వరరావు పాల్గొన్నారు.

రోలుగుంట: స్థానిక పశువైద్య కేంద్రం వద్ద శుక్రవారం పాడి రైతులకు పశుగ్రాస ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి నూకేశ్వర్రావు మాట్లాడారు. పశువు శరీర బరువును బట్టి రోజుకు 25 నుంచి 30 కిలోల పచ్చిమేత వేయాలన్నారు. ఐదు నుంచి ఏడు పశువులకు అవసరమయ్యే పశుగ్రాసం సాగుకు అవసరమైన సీఎస్ 23 రకం జొన్న విత్తనాలను 75 శాతం రాయితీపై ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు. ఆధునిక రకాలైన సూపర్ నేపియర్, రెడ్ నేపియర్, హెడ్యూసన్ వంటి పశుగ్రాస వంగడాలు అధిక దిగుబడి అందిస్తాయన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్

నర్సీపట్నం: పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకుడు ఈరెల్లి చిరంజీవి డిమాండ్ చేశారు. శుక్రవారం పంచాయతీ పారిశుధ్య కార్మికులతో కలిసి సంబంధిత కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి పని చేస్తున్న కార్మికులకు ప్రతి నెలా వేతనాలు చెల్లించాలన్నారు. వీరికి కనీస వేతనాలు అమలు చేయాలని, బీమా సౌకర్యం కల్పించాలన్నారు. చేతికి గ్లౌజులు, నూనెలు, సబ్బులు ఇవ్వాలన్నారు. సకాలంలో వేతనాలు ఇవ్వకపోవటం వల్ల కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘ నాయకులు పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న పంచాయతీ కార్మికులు

పింఛన్ల నగదు విడుదల

మాడుగుల రూరల్: ఎన్టీఆర్ భరోసా పథకం కింద వచ్చే నెలకు సంబంధించి పింఛన్ల నగదు విడుదలైనట్లు ఎంపీడీవో ఆర్. కాశీప్రసాదరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి సంబంధించి 11,803 మందికిగాను 5 కోట్ల 12 లక్షల 73 వేల 500 రూపాయలు వచ్చే నెల ఒకటో తేదీ నుంచి పింఛనుదారులకు సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ చేస్తామన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం

కె.కోటపాడులో సీపీఎం నిరసన

కె.కోటపాడు: కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగినట్లు సీపీఎం మండల కార్యదర్శి యర్రా దేముడు తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా శుక్రవారం స్థానిక మూడు రోడ్లు కూడలిలో పార్టీ నాయకులు నిరసన చేశారు. ఈ సందర్భంగా దేముడు మాట్లాడుతూ విశాఖ రైల్వే జోన్, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి నిధులు, ప్రత్యేక హోదా, విభజన హామీలు, తదితర విషయంలో వివక్ష చూపిందన్నారు. టీడీపీ, జనసేన పార్టీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి నిధులు రాబట్టాలని డిమాండ్ చేశారు. నాయకులు వనుము సూర్యనారాయణ, చెంబునాయుడు, అప్పారావు, శివ, ఈశ్వరరావు పాల్గొన్నారు.



కె.కోటపాడులో నిరసన చేపడుతున్న సీపీఎం నాయకులు

తహసీల్దార్ కార్యాలయం భద్రతపై ప్రత్యేక దృష్టి



వీఆర్‌ఏలకు సూచనలిస్తున్న డీటీ ఆనంద్

దేవరాపల్లి: తహసీల్దార్ కార్యాలయం భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామ రెవెన్యూ సహాయకులకు డిప్యూటీ తహసీల్దార్ జి. ఆనంద్ సూచించారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఏలతో శుక్రవారం ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర భూ పరిపాలన శాఖ కమిషనర్, కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ కార్యాలయం భద్రతను వీఆర్‌ఏలకు అప్పగించామన్నారు. భద్రత, రక్షణ విషయంలో విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇక్కడకు అనుమానిత వ్యక్తులు సంచరిస్తే తక్షణమే తహసీల్దార్, పోలీసులకు సమాచారం అందించాలని డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్ ఆదేశించారు.

డివిజన్‌లో 3,628 కౌలు కార్డుల మంజూరు లక్ష్యం

నర్సీపట్నం ఆర్డీవో జయరాం

నాతవరం: డివిజన్‌లో 167 రెవెన్యూ గ్రామాల్లో 3,628 కౌలురైతులకు కార్డులు ఇవ్వడానికి లక్ష్యంగా పెట్టుకున్నామని నర్సీపట్నం ఆర్డీవో హెచ్.వి. జయరాం తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలో రైతుల ప్రధాన సమస్యలను డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌ను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ డివిజన్‌లో అధికంగా నాతవరం మండలంలోనే 856 మంది కౌలురైతులకు కార్డులు ఇవ్వడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. తర్వాత నక్కపల్లి, చీడికాడ, కోటవురట్ల, గొలుగొండ, రోలుగుంట మండలాల్లో అధికంగా ఉన్నాయన్నారు. అర్హత ఉంటే ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. డివిజన్‌లో రికార్డులు భద్రతలో భాగంగా అన్ని తహసీల్దార్ల కార్యాలయాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. 1/70 యాక్టు పరిధి గ్రామాల్లో గిరిజనులకు అటవీ హక్కుపత్రాలు మంజూరుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. నాతవరం, గొలుగొండ, రోలుగుంట, చీడికాడ మండలాల్లో పోడు భూములు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయరు బాలరెడ్డి, సీనియర్ అసిస్టెంటు డి.కృష్ణ, ఆర్‌ఐ హరి, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం

తహసీల్దారు ఈశ్వరమ్మకు సన్మానం



తహసీల్దారు ఈశ్వరమ్మను సన్మానిస్తున్న డీటీ రమేష్, తదితరులు

కె.కోటపాడు: ఎన్నికల విధులకు వచ్చిన తహసీల్దారు జె.ఈశ్వరమ్మ సొంత జిల్లా శ్రీకాకుళంకు రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆమెకు దుశ్శాలువా కప్పి జ్ఞాపిక అందించి డిప్యూటీ తహసీల్దారు డి.రమేష్, సిబ్బంది సన్మానించారు. ఎన్నికల విధులతోపాటు రెవెన్యూ సేవలను సమర్థవంతంగా నిర్వహించారని ప్రశంసించారు. మండల సర్వేయర్ రామచంద్రమూర్తి, ఆర్‌ఐ జానకి, గ్రామ రెవెన్యూ అధికారులు, సచివాలయ సర్వేయర్లు, వీఆర్‌ఏ, తహసీల్దారు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్య సూత్రాలు పాటించాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి శ్యామ్

గొలుగొండ: విద్యార్థులు విద్యతోపాటు ఆరోగ్య సూత్రాలు పాటించాలని వైద్యాధికారి శ్యామ్ తెలిపారు. సాలికమల్లవరం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యతోపాటు విద్యార్థులకు ఆరోగ్య విషయాలపై పూర్తిగా అవగాహన కల్పించాలని సూచించారు. మంచి ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రధానంగా ఇళ్ల వద్ద నిల్వ నీరు ఉండటం వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందన్నారు. సీహెచ్‌వో ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచితంగా లంపీస్కిన్ నిరోధక టీకాలు

మాడుగుల: మండలంలో పశువులకు లంపీస్కిన్ వ్యాధి నిరోధక టీకాలు ఉచితంగా వేస్తున్నామని మాడుగుల ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ వి. చిట్టినాయుడు తెలిపారు. శుక్రవారం పోతనపూడి, ఒమ్మలి, సత్యవరం గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. మండలానికి 7,300 డోసులు సరఫరా చేయగా, ఇంత వరకు 6,454 పశువులకు టీకాలు వేశామన్నారు. రైతు సేవా కేంద్రాల్లో పశువైద్య సహాయకులను సంప్రదించి నాలుగు మాసాలు దాటిన ఆడ, మగ తెలుపు జాతి పశువులకు టీకాలు వేయించుకోవాలని సూచించారు. వ్యాధి సోకిన పశువును కడగొద్దని, మిగిలిన పశువులకు దూరంగా ఉంచాలని తెలిపారు.



పోతనపూడిలో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

ప్రభుత్వ స్థలం ఆక్రమించి రేకుల షెడ్డు

టీడీపీ నేతల ప్రోద్బలంతో దౌర్జన్యం

దేవరాపల్లి: ఎం.అలమండలో ప్రభుత్వ స్థలాన్ని టీడీపీకి చెందిన వ్యక్తి దర్జాగా ఆక్రమించాడు. గతంలో ఆక్రమించి వేసిన కమ్మలపాకను స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసుల సమక్షంలో రెవెన్యూ అధికారులు తొలగించారు. తాజాగా స్థానిక టీడీపీ నేతల ప్రోద్బలంతో రేకుల షెడ్డు వేయడం గమనార్హం. గ్రామ సర్వే నంబర్ 523, 524లలో పది సెంట్ల పోరంబోకు (గోర్జు) స్థలం ఉంది. దీనిలో కొంత మేర స్థలంలో వార్డు మెంబర్ ఒనుం అచ్చియమ్మ, నాగేశ్వరరావు దంపతులు అక్రమంగా వేసిన కమ్మల పాకను 2022 ఫిబ్రవరి 16న పోలీస్ బందోబస్తు నడుమ రెవెన్యూ అధికారులు జేసీబీతో తొలగించారు. తాజాగా రేకుల షెడ్డు వేయగా, దీన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించిన వీఆర్వో పవన్‌పై బెదిరింపులకు పాల్పడ్డారు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వీఆర్‌వో తెలిపారు.



ప్రభుత్వ భూమిలో తాజాగా నిర్మించిన రేకుల షెడ్డు

రావికమతంలో వాహనాల తనిఖీ

చోడవరం: రావికమతంలో పోలీసులు విస్తృతంగా వాహనాలు తనిఖీ చేశారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ లక్ష్మణరావు హెచ్చరించారు. శుక్రవారం బీఎన్ రోడ్డులో వాహనాలను తనిఖీ చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేయండి

చోడవరం: సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని సచివాలయ, పంచాయతీ సిబ్బందిని పంచాయతీ కార్యదర్శి నారాయణరావు ఆదేశించారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామసభకు ప్రజలెవ్వరూ హాజరుకాలేదు. పంచాయతీ పరిధిలోని ఐదు సచివాలయాల సిబ్బంది, పంచాయతీ సిబ్బంది మాత్రమే వచ్చారు. సీజనల్ వ్యాధులపై వార్డుల్లో విస్తృతంగా పర్యటించి, ప్రజలను చైతన్య పరచాలని కార్యదర్శి తెలిపారు. జ్వరాలు వస్తే వెంటనే హెల్త్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మరుగుదొడ్ల నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. ద్వారకానగర్‌లో సామూహిక మరుగుదొడ్లు (సులభ్ కాంప్లెక్స్)ను నిర్మించాలని వార్డుమెంబరు శ్రీనువాసరావు కోరడంతో అందుకు తగ్గ స్థలాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. సర్పంచ్ బండి నూకాలమ్మశ్రీను పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి నారాయణరావు

డిజిటల్ విద్యపై అవగాహన తప్పనిసరి



నేల సారవంతం గురించి విద్యార్థులకు వివరిస్తున్న లక్ష్మణ్



కింతలి హైస్కూలులో డిజిటల్ తరగతుల నిర్వహణ

నర్సీపట్నం/మాకవరపాలెం: శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నర్సీపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డిజిటల్ విద్య, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంఈవో సిహెచ్. తలుపులు మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో డిజిటల్ విధానంపై అవగాహన చాలా అవసరం అన్నారు. చెట్టుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సచివాలయ ఇంజనీరింగ్ సహాయకురాలు పి.రేణుక నీటి నాణ్యత పరీక్షను ప్రయోగ పూర్వకంగా వివరించారు. వీఏఏ లక్ష్మణ్ నేల సారవంతం తెలియజేసే సాంకేతికతను వివరించారు. మాకవరపాలెం మండలంలో ఈ కార్యక్రమాన్ని ఎంఈవోలు మూర్తి, జాన్‌ప్రసాద్ పర్యవేక్షించారు.

మాడుగుల రూరల్/దేవరాపల్లి: శిక్షా సప్తాహ్‌లో భాగంగా మాడుగుల మండలం కింతలి హైస్కూలు, జె.డి.పేట, సత్యవరం స్కూలులో డిజిటల్ విద్యపై ఎంఈవో బి. దేముడమ్మ అవగాహన కల్పించారు. దేవరాపల్లి ఉన్నత పాఠశాలలో డిజిటల్ విద్య, ప్రస్తుత సమాజంలో సాంకేతికత ఆవశ్యకతను ఎంఈవో -1 బి. పడాల్‌దాస్ అవగాహన కల్పించారు.

చోడవరం రూరల్/రోలుగుంట: శిక్షా సప్తాహ్‌లో భాగంగా పాఠశాలల్లో సాంకేతిక, నైపుణ్య దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు నైపుణ్యాలను అలవరుచుకుని, అభివృద్ధి పరచుకోవడం పట్ల ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. రోలుగుంట పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం

నాతవరం: విద్యార్థుల భోజనం విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీడీవో జాగర్ల రాంబాబు వార్డెన్‌కు సూచించారు. స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహాన్ని శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రుచికరంగా లేని కూర, సాంబారుతో విద్యార్థులు ఎలా తినగలరని వార్డెన్ రొంగలి శివ, వంట కుక్‌లను మందలించారు. ఇక మీదట రుచికరంగా వడ్డించాలని సూచించారు. విద్యార్థుల స్నానాల గదులు, బాత్‌రూమ్‌లు అపరిశుభ్రంగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రాంబాబు

ఎస్సీ వర్గీకరణ చేయాలి

చీడికాడ: ఎస్సీ వర్గీకరణపై కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలుపుకోవాలని మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మొర్తా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం జైతవరంలో ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.